www.prajasakti.com
ప్రజాశక్తి

జిల్లాలో 14,383 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 14,383 మెట్రిక్ టన్నుల ఇసుక వినియోగదారులకు సరఫరా చేసినట్లు మైనింగ్ డీడీ రవికుమార్ తెలిపారు. ఈ నెల 27వ తేదీ మంగళవారం మూడు బుకింగ్ సెంటర్ల ద్వారా 2,570 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా జరిగిందన్నారు. మూడు బుకింగ్ సెంటర్లలో 141 ఆర్డర్లు నమోదు కాగా అన్నింటికీ ఇసుక సరఫరా అయిందని తెలిపారు. ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ వద్ద మెట్రిక్ టన్నుకు రూ.210, చేబ్రోలు స్టాక్ పాయింట్ వద్ద రూ.538, వింజరం స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు రూ.362కు ఇసుకను విక్రయదారులకు సరఫరా చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఇక్కడ పెండింగ్ లేకుండా అందిన బుకింగ్ మేరకు ఇసుక వినియోగదారులకు సరఫరా చేయడమైందన్నారు. ఇసుక సరఫరాపై ర్యాండమ్‌గా 25 మంది వినియోగదారులకు ఫోన్ చేయగా నూరు శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

పోలీసు శాఖలో బదిలీల బెంగ..!

ఎస్ఐల బదిలీల్లో చెల్లని ఎంఎల్ఎల సిఫార్సు లేఖలు

అమరావతి ఆదేశాలతోనే ఎస్ఐ, సిఐల బదిలీలు

వైసిపి హయాంలో టిడిపి నేతలపై కేసు పెడితే పోస్టింగ్ కష్టం

ఐదేళ్లు ఒకేచోట పని చేసిన సిబ్బంది బదిలీలపై స్పష్టత కరువు

జీరో సర్వీస్ రిక్వెస్ట్ బదిలీలపై మౌనం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలీస్‌శాఖలో సిఐ, ఎస్ఐల బదిలీలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాల్లో ఇటీవల కాలంలో పెద్దఎత్తున సిఐ, ఎస్ఐల బదిలీలు జరిగాయి. బదిలీలకు సంబంధించి మరో జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. చాలామంది అధికారులు ఎంఎల్ఎల సిఫార్సు లేఖలు తీసుకుని తాము కోరుకున్న చోటుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేసినా చుక్కెదురైనట్లు తెలుస్తోంది. బదిలీల ప్రక్రియ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయంతో కాకుండా అమరావతి నుంచి వచ్చే ఆదేశాలతో జరుగుతుందని చెబుతున్నారు. జిల్లా అధికారులు బదిలీల జాబితా తయారు చేసి అమరావతికి పంపిన తర్వాత అక్కడ నుంచి వచ్చే అదేశాలకు అనుగుణంగా సిఐ, ఎస్ఐలను బదిలీ చేస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీల కోసం అమరావతిలో ప్రత్యేకంగా ఒక టీమ్ పని చేస్తున్నట్లు చెబుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వైసిపి నాయకులను అనుకూలంగా వ్యవహరించిన, ఏదైనా కారణంతో అప్పట్లో టిడిపి నాయకులపై కేసు నమోదు చేసిన అధికారులకు పోస్టింగ్ ఇవ్వకుండా నిలుపుదల చేస్తున్నారు. కొంతమందిని పక్కన పెడుతున్న పరిస్థితి కన్పిస్తోంది. పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో ఈ విధంగా పలువురి ఎస్ఐలకు పోస్టింగులు ఇవ్వకుండా పక్కన పెట్టిన పరిస్థితి ఉందని తెలుస్తోంది. పోస్టింగ్ ఇవ్వకుండా ఆపిన అధికారుల గురించి ఎంఎల్ఎలు నేరుగా పైస్థాయిలో మాట్లాడినా పట్టించుకోవడం లేదని సమాచారం. దీంతో ఎంఎల్ఎలు సైతం ఏమి చేయలేక చేతులెత్తేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఎంఎల్ఎలు సిఫార్సులు లేఖలు ఇచ్చినప్పటికీ అధికారులను సైతం పక్కన పెట్టడం పోలీస్‌శాఖలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కిందిస్థాయి అధికారులు పని చేస్తారు. కొంతమంది ఎస్ఐ, సిఐలపై కక్షగట్టి పోస్టింగ్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం పోలీస్ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. గత వైసిపి ప్రభుత్వం ఇదేవిధంగా చేసిందని కొత్త ప్రభుత్వం వచ్చాక ఇటువంటివి కొనసాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తప్పు చేయని కొంతమంది అధికారులను కూడా వైసిపి అనుకూల జాబితాలో చేర్చి పోస్టింగ్ ఇవ్వడం లేదనే అభిప్రాయం పోలీస్‌శాఖలో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి వదిలి పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది. పోలీస్ శాఖాధికారుల బదిలీల్లోనూ పెద్దఎత్తున రూ.లక్షల్లో మామూళ్ల చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీస్ సిబ్బంది బదిలీలపై స్పష్టత ఏది..?

పోలీస్‌శాఖలో బదిలీలపై సర్వత్రా చర్చ సాగుతోంది. 15 శాఖల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఈ నెల 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. పోలీస్ శాఖలోని సిబ్బంది బదిలీలకు సంబంధించి మాత్రం ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని, అనారోగ్య సమస్యలు, కుటుంబంలోని ఇబ్బందుల నేపథ్యంలో ఎంతోమంది పోలీస్ సిబ్బంది రిక్వెస్ట్ బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. పోలీస్‌శాఖలో సిబ్బందికి సంబంధించి బదిలీ ఆదేశాలు ఎందుకు ఇవ్వలేదనే చర్చ నడుస్తోంది. రెండు జిల్లాల్లో దాదాపు మూడు వేల మంది వరకూ పోలీస్ సిబ్బంది ఉన్నారు. దాదాపు 60 వరకూ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతి స్టేషన్‌లోనూ ఐదేళ్లు పూర్తి చేసుకున్న సిబ్బంది నలుగురైదుగురు ఉన్న పరిస్థితి. అంతేకాకుండా జీరో సర్వీస్ బదిలీల కోసం ఎదురుచూస్తున్న సిబ్బంది చాలామంది ఉన్నారు. పోలీస్ శాఖలోని సిబ్బంది బదిలీలపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. పోలీస్ సిబ్బంది బదిలీలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇచ్చి ప్రక్రియ చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

టిడిపి గూటికి మేయర్ దంపతులు

బొద్దాని, ఆయన కుమార్తెతోపాటు మంచెం మైబాబు చేరిక

పెద్దఎత్తున కార్పొరేటర్లు చేరేందుకు రంగం సిద్ధం



నారా లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు మంగళవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ సమక్షంలో టిడిపి గూటికి చేరారు. వీరితోపాటు ఏలూరులో వైసిపి కీలక నేతలుగా కొనసాగిన బొద్దాని శ్రీనివాస్, ఆయన కుమార్తె అఖిల, మంచెం మైబాబు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అమరావతిలో వీరందరికీ లోకేష్ పార్టీ కండువా కప్పి చేర్చుకున్నారు. వీరిని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి దగ్గరుండి తీసుకెళ్లారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మేయర్ దంపతులతోపాటు, ఇతర వైసిపి నాయకులంతా వైసిపికి దూరంగా ఉంటున్నారు. తమ పదవులు కాపాడుకోవడం, వ్యాపారాలు సవ్యంగా సాగడం వంటి అనేక కారణాలతో టిడిపికి దగ్గరవుతూ వచ్చారు. అధికారికంగా మాత్రం మంగళవారం టిడిపిలో చేరారు. ఏలూరు కార్పొరేషన్‌కు చెందిన మరో 30 మంది కార్పొరేటర్లు టిడిపిలో చేరనున్నట్లు చెబుతున్నారు. వీరంతా ఎంఎల్ఎ చంటి ఆధ్వర్యంలో చేరతారా.. లేక రాష్ట్రనేతల సమక్షంలో చేరతారా అనే సందిగ్ధత కొనసాగుతోంది.

అభివృద్ధే లక్ష్యంగా అందరి ప్రయాణం

ఎంఎల్ఎ బడేటి చంటి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు అభివృద్ధే లక్ష్యంగా అందరి ప్రయాణం ఉంటుందని, కూటమి ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి మరింత చురుగ్గా తీసుకెళ్లాలన్న ఏకైక లక్ష్యంతో అందరినీ కలుపుకుని ముందుకు సాగుతున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరు పవర్‌పేటలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఇతర నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గడిచిన మూడేళ్లలో ఏలూరు నగరంలో అభివృద్ధి కుంటుపడిందని, ఈ విషయంలో తాము ఏమీ చేయలేకపోయామన్న నిస్పృహలో ఉన్న ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు, ఈడా మాజీ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఎఎంసి మాజీ ఛైర్మన్ మంచెం మైబాబు వంటి వారికి స్నేహ హస్తం అందించి పార్టీలో చేర్చుకున్నట్లు చెప్పారు. వారితో పాటు మరొక 29 మంది కార్పొరేటర్లు కూడా పార్టీలో చేరనున్నారని చెప్పారు. మిగిలిన వారి విషయంలో పార్టీ కేడర్ మనోభావాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి, వివిధ పక్షాల నేతలు, వర్తకులు, వ్యాపారులు, ఇతర వర్గాల అభిప్రాయాలను తీసుకుని నగరాభివృద్ధికి పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ ఏలూరు అభివృద్ధి చెందాలన్న తమ ఆశలు నెరవేరేలా తమను పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి నారా లోకేష్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటికి ధన్యవాదాలు తెలిపారు. ఒక కుటుంబంలా అందరూ కలిసికట్టుగా ఏలూరు నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ఎంఎల్ఎ బడేటి చంటి సారథ్యంలో ముందుకు సాగుతామన్నారు. నగరాభివృద్ధే లక్ష్యంగా ఉదయం ఆరు గంటల నుంచే ప్రజలకు అందుబాటులో ఉంటూ సుపరిపాలన అందిస్తున్న బడేటి చంటి బాటలో పయనిస్తామని, ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు పునరంకితం అవుతామని తెలిపారు. బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ వైసిపి కోసం తాను ఎంతో కష్టపడ్డానని, ప్రతి కార్యక్రమానికి ప్రధాన పాత్ర పోషించానని, కాని జెండా పట్టుకున్న కార్యకర్తకు న్యాయం జరగలేదన్నారు. ప్రతి కార్యకర్తకు ఏ సమస్య వచ్చినా ముందుండే పార్టీ తెలుగుదేశం అని నమ్మి ఈ పార్టీలో చేరానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, నాయకులు ఎంఆర్‌డి బలరాం, పెద్దిబోయిన శివప్రసాద్, కొల్లేపల్లి రాజు, మారం అను, ఆర్నేపల్లి తిరుపతి, పైడి వెంకటరావు, వందనాల శ్రీను, కార్పొరేటర్ బొద్దాని అఖిలప్రియ పాల్గొన్నారు.

వైద్యులు సేవాభావంతో ఉండాలి

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వైద్యులు అందించే చికిత్స సేవాభావంతో కొనసాగాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో ఉన్న ఎస్ కన్వెన్షన్ హాలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ప్రయివేట్ వైద్యులు సామాన్య ప్రజానీకానికి సేవాభావంతోనే చికిత్స అందించాలన్నారు. అధిక బిల్లులతో పేదలను భయపెట్టవద్దని సూచించారు. ఇటీవలి కాలంలో వైద్యులపై జరుగుతున్న దాడులను ఖండించారు. వైద్యులు బాగుంటేనే అన్ని తరగతుల ప్రజలకు సకాలంలో చికిత్స అందుతుందని, తద్వారా ప్రజానీకం ప్రాణాపాయం నుంచి బయటపడి జీవించగలుగుతారనే నిజం ప్రతిఒక్కరూ గుర్తించాలని మంత్రి పార్థసారథి తెలిపారు. సమస్యలు తలెత్తితే తగిన విధంగా చర్చించుకుని పరిష్కరించుకోవచ్చన్నారు. కుల మతాలకు అతీతంగా అందరూ దైవంగా భావించే వైద్యులను గౌరవించుకోవడం, రక్షించుకోవడం ప్రతిఒక్కరీ బాధ్యత అన్నారు. అటు వైద్యుల వద్ద, ఇటు ప్రజల వద్ద సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వైద్యులు ప్రజల మధ్య ఓ చక్కని మానవ సంబంధాలు కొనసాగే విధంగా ఉండాలన్నారు. అంతర్జాతీయంగా మార్కెటింగ్ నూజివీడు నుంచి కల్పించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో రానున్న మార్చి, ఏప్రిల్ మాసాలకు మామిడి మార్కెట్ ప్రారంభించేందుకు ప్రణాళికా బద్ధంగా ముందడుగులు వేస్తున్నామన్నారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక వసతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించనున్నట్లు తెలిపారు. స్టేడియం నిర్మాణాన్ని పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూజివీడు శాఖ ప్రెసిడెంట్ పి.రవికిరణ్, సెక్రటరీ ఎం.శిరీష, నూజివీడు ప్రముఖ వైద్యులు బొబ్బిలి ఝాన్సీరాణి, ఎం.రాఘవరావు, విస్సన్నపేట నూజివీడు వైద్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

అర్హులు ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

కళాశాలల్లో ఓటుహక్కు నమోదుపై అవగాహనా కార్యక్రమాలు

ఒక కుటుంబంలోని ఓటర్లంతా ఒకే పోలింగ్ బూత్‌లో ఉండాలి

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణపై కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తయిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025పై జిల్లాలోని ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలతో మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ-2025 తయారీకి పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి చనిపోయిన, వలస వెళ్లిన వారి వివరాలు సర్వే చేయాలన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన వారు ఓటరుగా నమోదయ్యేందుకు దరఖాస్తులు అందించాలన్నారు. దరఖాస్తులు నిర్దేశిత సమయంలోగా పరిష్కరించి, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు అధికారులు కృషి చేయాలన్నారు. ఓటర్ల నమోదుపై ప్రతి కళాశాలలో అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు అన్ని ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు నమోదు, చిరునామా మార్పు, ఫొటో ఓటరు గుర్తింపు కార్డులో ప్రస్తుత ఫొటో మార్పు, జాబితాలో పేరు తొలగింపు అంశాలకు సం బంధించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె. ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బాబ్జి, ముక్కంటి పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళిక సాధన పూర్తి చేయాలి: కలెక్టర్

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు వంద రోజుల ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాల సాధన పూర్తి చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో అధికారులతో వంద రోజుల ప్రణాళిక లక్ష్య సాధనపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయం, అనుబంధ శాఖలు, పరిశ్రమలు, విద్య, వైద్యం, రోడ్లు, భవనాలు, ఐసిడిఎస్, పౌర సరఫరాలు తదితర శాఖల పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వారికి నిర్దేశించిన లక్ష్యాల్లో వంద రోజుల్లో పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ఆయా పనులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూరు రోజుల ప్రణాళిక అమలులో ఏలూరు జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందుస్థానంలో నిలిపేలా అధికారులు పని చేయాలన్నారు. లక్ష్యాల సాధనపై ఆయా శాఖలు రూపొందించిన నివేదికలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. సమావేశంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, అటవీశాఖాధికారులు రవిశంకర్, హిమశైలజ, డ్వామా పీడీ పి.రాము, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ, డిఇఒ అబ్రహం, జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్ భాషా, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు, ఎంఐపి పీడీ రవికుమార్, ఉద్యాన శాఖాధికారి రామ్మోహన్, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, గృహనిర్మాణ శాఖాధికారి శ్రీనివాస్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి - కుక్కునూరు

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఇటీవల మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడంతో భద్రాచలానికి ఎగువన ఉన్న ప్రాణహిత నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం ఏడు గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 28.06 అడుగులకు చేరింది. దాచారం-కుక్కునూరు మధ్య ఉన్న గుండేటి బ్రిడ్జి గత వరద ప్రవాహానికి దెబ్బతినడంతో రెండు నెలలుగా 16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మళ్లీ గోదావరి పెరుగుతుండటంతో మిర్చి నాట్లు వేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోలవరం స్పిల్‌వే నుంచి 4,14,380 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదులు, కొండవాగుల జలాలు గోదావరిలో కలుస్తుండటంతో గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి పోలవరం ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో 4.14.380 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 29.570 మీటర్లు, స్పిల్‌వే దిగువన 20.150 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ఇఇ పి.వెంకటరమణ తెలి పారు. కొండవాగుల జలాలతో ఎల్ఎన్‌డిపేట రిజర్వాయర్ నీటిమట్టం పెరిగింది. నీటిమట్టం 89.70 మీటర్లకు చేరడంతో 120 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసినట్లు రిజర్వాయర్ సిబ్బంది తెలిపారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో పట్టిసీమ శివక్షేత్రం వద్ద ఇసుక తిన్నెలు నీటమునిగాయి. కొవ్వాడ రిజర్వాయర్ నుండి విడుదలైన జలాలు పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిస్ నుండి గోదావరిలో కలుస్తు న్నాయి. గోదావరి నీటిమట్టం పెరగడంతో పోశమ్మ గండి ఆలయానికి రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

గండేటి వాగు వద్ద వరద ఉధృతి

జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణానికి అంచనాలు

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయం నూతన భవన నిర్మాణానికి సమగ్ర అంచనాలతో పరిపాలనా ఆమోదానికి ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఆమె తన అధ్యక్షతన సెస్ కమిటీ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల నుండి సుమారు రూ.20 కోట్లు గ్రంథాలయ సెస్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థకు బకాయి ఉన్నట్లు గుర్తించారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయం ప్రస్తుతం నిర్వహిస్తున్న భవనం శిథిలావస్థలో ఉన్నందున వెంటనే నూతన భవన నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. దీనికి స్థానిక సంస్థల నుంచి ఉన్న బకాయిలు రూ.20 కోట్ల నుండి వెంటనే 10 శాతం చెల్లించేందుకు, స్థానిక సంస్థలు నిర్ణయించే ఆస్తి లేక ఇంటిపన్నుపై 8 శాతం చొప్పున గ్రంథాలయ సెస్ డిమాండ్‌కు సంబంధించిన వివరాలు కూడా తెలియజేయాలని మున్సిపల్ కమిష నర్లు, డిపిఒను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని వైటిసి భవనంలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు, డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ, పలువురు మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ఆడిట్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి ధాత్రిరెడ్డి

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

వైద్య విద్యార్థినిపై హత్యాచారంపై నిరసన

ఐద్వా ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం



ఏలూరు అర్బన్ : మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

ఉంగుటూరు : కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, దుగ్గిరాల సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల, సెయింట్ జాన్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరులో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వందలాదిమంది విద్యార్థులతో గవరవరంలోని సెయింట్ థెరిస్సా మహిళ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ అమీనాపేట, పోలీస్ కళ్యాణ మండపం, ప్రభుత్వాసుపత్రి మీదుగా ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు సాగింది. అనంతరం ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద భారీ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా థెరిస్సా కాలేజీ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ డాక్టర్ మెర్సీ, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ కొత్త చట్టాలు తీసుకొస్తున్నప్పటికీ సమాజంలో ప్రతిరోజు ఏదో ఒకచోట మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని విమర్శించారు. ఏలూరులోని గత ఆరు మాసాల్లో ఆరుగురిపై హత్య, అత్యాచార ఘటనలు వెలుగు చూశాయన్నారు. సమాజంలో మహిళలను రెండో తరగతి పౌరులుగా చూసే సంస్కృతి పోవాలన్నారు. సినిమాలు, సాహిత్యం, ఇంటర్నెట్ మాధ్యమాల్లో హింస, అశ్లీలత అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు అన్నిచోట్ల ఏర్పాటుచేసి నిందితులకు వెంటనే కఠిన శిక్షలు పడేలా చూడాలని నిర్భయ ఉదాంతం సందర్భంగా జస్టిస్ వర్మ కమిషన్ ఇచ్చిన సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో వైద్యులు కోరుతున్న విధంగా వారు విశ్రాంతి తీసుకోవడానికి సెక్యూరిటీతో కూడిన గదులను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే మహిళలను గౌరవించడం నేర్పించాలని, దానికి అనువైన పాఠ్యాంశాలు పిల్లలకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో థెరిస్సా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ సుశీల, ఎన్ఎస్ఎస్ సెల్, ఉమెన్స్ సెల్ ఆధ్యాపక బృందం, సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ మోజెస్, ప్రిన్సిపల్ డాక్టర్ స్లివరాజు, విద్యార్థులు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, నాయకులు జయ, హరీష్, దుర్గ, డివైఎఫ్ఐ నాయకులు పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, దాడులకు నిరసనగా చేబ్రోలు సర్పంచి లక్ష్మీ సునీత ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చేబ్రోలు గాంధీ విగ్రహం నుంచి నారాయణపురం వంతెన వరకు సుమారు రెండు కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, కూటమి మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొలకత్తాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి నిరసనగా మానవహారం నిర్వహించారు.

ఆర్‌డిఒ ఆర్డర్లు ఆపాలి

ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ

బుట్టాయగూడెం : ఏజెన్సీలో 1/70, ఎల్‌టిఆర్, పీసా చట్టాలకు విరుద్ధంగా ల్యాండ్ కన్వెన్షన్ పేరుతో ఆర్‌డిఒ జారీ చేసిన ఆర్డర్లను తక్షణమే నిలుపుదల చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో కొంతమంది గిరిజనేతరులు వ్యవసాయ భూమిని ల్యాండ్ కన్వెన్షన్ పేరుతో ఆర్‌డిఒ నుంచి అనుమతులను తీసుకొని ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. వీటినే తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ ఇస్తున్న ల్యాండ్ కన్వెన్షన్ ఏజెన్సీ ప్రాంత చట్టాలకు పూర్తి విరుద్ధమైనవని, దీన్ని సాకుగా చూపి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వీటిని వెంటనే ఆపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్లాట్ల అమ్మకాలు తక్షణమే ఆపాలని, ఐటిడిఎ పిఒ, కలెక్టర్ జోక్యం చేసుకుని చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని రామకృష్ణ హెచ్చరించారు.

'మానస' విద్యార్థుల సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమడోలు

మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని మంగళవారం భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు చేపట్టిన సేవా కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ చౌదరితో స్పందించిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పేదలకు తాము సేకరించిన పాత దుస్తులు, వైద్యం అవసరమైన వారికి ఆర్థికసాయం మందులు అందించారు. విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించేందుకు ఈ తరహా కార్యక్రమాలు చేపట్టినట్లు కరస్పాండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

పేదలకు దుస్తులు అందిస్తున్న విద్యార్థులు

1న జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉమ్మడి కృష్ణాజిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వచ్చేనెల ఒకటో తేదీన ఆదివారం నూజివీడులో ఉన్న ఎంఆర్.అప్పారావు పీజీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి కృష్ణా జిల్లా సబ్ జూనియర్స్ బాల బాలికల విభాగానికి జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి వివివి.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జిల్లా జట్టు ఎంపికకు వచ్చే క్రీడాకారులు ముందుగా వారి వివరాలను ఆర్. వేణుగోపాల్ 9490334333కు తెలిపి ముందుగా రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఇక్కడ ఎంపికైన ఉమ్మడి కృష్ణాజిల్లా సబ్ జూనియర్స్ బాల బాలికల జిల్లా జట్టు వచ్చేనెల సెప్టెంబర్ 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని ప్రధాన కార్యదర్శి వివివి.ప్రసాద్ తెలిపారు.

గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. మీకోసం – మీ చింతమనేని కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. తొలుత కవ్వగుంటలో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమైన ఎంఎల్ఎ చింతమనేని గ్రామస్తుల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించి, వాటిపై సంబంధిత అధికారులతో చర్చించారు. సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జగన్నాథపురం, జానంపేట గ్రామాల్లో పర్యటించారు.

పాఠశాలలో 'ఫిట్ ఇండియా ప్లెడ్జ్'

ప్రజాశక్తి - ముసునూరు

హాకీ మాంత్రికుడిగా పేరుగాంచిన మేజర్ ధ్యాన్ చంద్ పుట్టిన రోజు (నేషనల్ స్పోర్ట్స్ డే ను) పురస్కరించుకుని మంగళవారం ఫిట్ ఇండియా ప్లెడ్జ్‌ను మండలంలోని వేల్పుచర్ల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యం కోసం ప్రతిరోజు కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనానికి రోజు ఆటలు ఆడాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరావు, మైదిలి, కుటుంబరావు, మాధవి, లత, సుశీల, శాంసుందరరావు, సురేష్ స్వరూప, సుకుమార్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు, కొర్లగుంట, కాట్రేనిపాడు, చింతలవల్లి గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వైద్యులు షకీలా ఇవాంజలి, కరీముల్లా చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 132 మంది రోగులకు వైద్య సేవలందించినట్లు చెప్పారు. ఏడుగురు జ్వర బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిధిలో అక్టోబర్ 18వ తేదీ వరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి, భీమడోలు తహశీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్ తెలిపారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 25వ తేదీన ఓటర్ల తుది జాబితాను ప్రచురించారు. దీనిలో ఏమైనా తప్పులు, మార్పులు, సవరణల గురించి తెలుసు కునేందుకు బూత్ లెవెల్ అధికారులు ఇంటింటా సర్వే నిర్వహించనున్నారు. ఓటర్లు తమ వద్దకు వచ్చే బూత్ లెవెల్ అధికారులతో ఆ తరహా లోపాలను సవరించాలని కోరుతూ సంబంధిత దరఖాస్తులను వారికి అందించాలని వారు కోరారు.

నూజివీడు రూరల్ ఎస్ఐగా లక్ష్మణ్‌బాబు బాధ్యతలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు రూరల్ ఎస్ఐగా లక్ష్మణ్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్ ఇప్పటివరకు ఎస్ఐగా పనిచేసిన మల్లికార్జున్‌రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. లక్ష్మణ్‌బాబు ఇప్పటివరకు ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పనిచేశారు. బదిలీపై నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.

పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వచ్చే నెల రెండో తేదీన నిర్వహించే జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం నుంచి ఏలూరులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఉభయ గోదావరి జిల్లాల అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం అశోక్‌నగర్‌లోని అశోక్ వర్ధన్ స్కూలులో మొక్కలు నాటే కార్యక్రమం, స్కూల్ పిల్లలకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం, అనంతరం మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన నాయకులు నారా శేషు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్డిఅప్పలనాయుడు మాట్లాడుతూ ఈ వారం రోజులు కూడా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, వృద్ధాశ్రమంలో అన్నదానం, రవితేజ బ్లైండ్ స్కూలులో పిల్లలకు అన్నదాన కార్యక్రమం, బాలికల స్కూలులో వ్యాసరచన పోటీలు, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం, రెండో తేదీన అన్ని ఏరియాల్లో కూడా అన్నదాన కార్యక్రమాలు, పార్టీ కార్యాలయంలో మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరం వీటితో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ, ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్, కావూరి వాణిశ్రీ, నాయకులు వీరంకి పండు, దోసపర్తి రాజు, బొత్స మధు, ధర్మేంద్ర, గొడవర్తి నవీన్, బెజవాడ నాగభూషణం, జగపతి మనోహరం స్వామి, ఆదుర్తి శ్రీనివాస్‌నాయుడు, చిత్తరి శివ, మల్లపు రెడ్డి సోంబాబు, సాయి రామ్‌సింగ్, ఎమ్‌డి.ప్రసాద్, మడుగుల మాణిక్యాలరావు, రాచప్రోలు వాసు, వన్‌టౌన్ మహిళ అధ్యక్షురాలు గిడుతూరి పద్మ, మహిళ ప్రధాన కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

భార్య తప్పిపోయిందని బాధతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తూటిగుంట నిర్వాసిత కాలనీకి చెందిన బి.జగదీష్ (29) భార్య కనిపించకుండాపోయింది. దీంతో మనస్తాపానికి గురైన జగదీష్ తాను చనిపోతానని పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు నచ్చ చెప్పి బర్రింకలపాడులోని బంధువుల ఇంటికి పంపారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ధాన్యం సేకరణపై ముందస్తు తనిఖీలు

ఉంగుటూరు మండలంలో జెసి ధాత్రిరెడ్డి పర్యటన

ప్రజాశక్తి - ఉంగుటూరు

వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం సేకరణపై ముందస్తు చర్యల్లో భాగంగా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి మంగళవారం తనిఖీలు చేశారు. ఆమె ఉంగుటూరు మండలంలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత నాచుగుంటలో గాయత్రి ట్రేడర్స్ రైస్ మిల్లును సందర్శించారు. మిల్లు కెపాసిటీ ఎంత, రోజుకు ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేయగలుగుతున్నారు, పోర్టుఫైడ్ బియ్యం మిక్సింగ్ సాంకేతిక యంత్ర పరికరాల పనితీరును, తేమ శాతం కొలిసే పరికరాలు, బ్లెండింగ్ మిషన్ పనితీరును స్వయంగా పరిశీలించారు. మిల్లు నిర్వాహకుడు నారాయణం సత్తిపండు నుంచి ఆరా తీశారు. గత సీజన్‌లో ఎంత ధాన్యం సేకరించారో తెలుసుకున్నారు. ప్రస్తుతానికి ఈ మిల్లు వద్ద 70 వేల గన్నీ బ్యాగ్స్ అందుబాటులో ఉన్నట్లు ట్రేడర్ చెప్పగా అవన్నీ రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అనంతరం నారాయణపురం సొసైటీకి వెళ్లారు. అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను విన్నారు. అక్కడ నుంచి స్థానిక సొసైటీకి వెళ్లారు. పైలెట్ ప్రాజెక్టుగా కంప్యూటరీకరణ జరుగుతున్న నారాయణపురం సొసైటీలో ఇప్పటివరకు ఎన్ని రికార్డులు డిజిటలైజేషన్ చేశారో ఆరా తీశారు. గోనె సంచుల నిల్వలు, ఎరువులు, పురుగుమందుల లభ్యత స్టాకు వివరాల దస్త్రాలను తనిఖీ చేశారు. అక్కడి నుంచి నారాయణపురంలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి రైతులతో ఆమె మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రబీలో ధాన్యం అక్టోబరు 25 నుంచి నవంబరు మొదటి వారంలోపే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తేనే ఉపయోగం ఉంటుందని రైతులు చెప్పారు. గతంలో పంట కోతలు ప్రారంభమైన ధాన్యం రాశులు రోడ్లపై కల్లాల వద్ద స్టాకు ఉన్న తరువాతే ఫ్యాడీ ప్రొక్యూర్‌మెంట్ చేసేవారని, ఈ విధానం వల్ల నష్టపోతున్నామని, ముందస్తుగానే పిపిసి ప్రారంభించాలని రైతులు కోరగా అందుకు తగ్గట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను జెసి ఆదేశించారు. బంటా కూలీలు లేకపోవడంతో ధాన్యం పట్టుపబడి ఎగుమతులు ఆలస్యం కాకుండా చూడాలని రైతులు కోరారు. డిఎస్ఒ సూర్యనారాయణరాజు, డిసిఒ శ్రీనివాస్, డిఎం మంజుభార్గవి, భీమడోలు ఎడిఎ ఉషారాజకుమారి, తహశీల్దార్ పొట్టూరి సురేష్, రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

నారాయణపురంలో గోనె సంచులను పరిశీలిస్తున్న జెసి

29న గ్రీవెన్స్ డే

బుట్టాయగూడెం రూరల్ :ప్రతి నెల నాలుగో గురువారం జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఏజెన్సీ మండలాల్లో గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 29వ తేదీ గురువారం ఐటిడిఎ, సమావేశపు హాలులో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నారు.

విద్యార్థులకు ఉచిత బస్ పాసులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ఆర్‌టిసి ధికారులు ఉచిత బస్ పాసులు మంగళవారం పంపిణీ చేశారు. బస్ పాస్‌ల ఐడీ కార్డులకు అయిన ఖర్చును పెద్దినుడ్డి వేణుగోపాలకృష్ణ ప్రసాదరావు, శేషవేణి ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ముత్తంగి వేణు గోపాల్ అందించడం అభినందనీయమని, ఉచిత పాస్‌లతో విద్యార్థులు పాఠశాలలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి అన్నారు.

మందులపై జిఎస్‌టి ఎత్తివేయాలి

ఎపి మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మందులపై జిఎస్‌టి ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వివిఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మా రంగంలో మందుల కంపెనీల దోపిడి అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అత్యవసర, నిత్యవసర మందులపై జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా రంగంలో కంపెనీ యాజమాన్యాలు, లేబర్ డిపార్ట్‌మెంట్, సేల్స్ రిప్రజెంటివ్స్‌తో కూడిన కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఫార్మా కంపెనీల్లో పని చేస్తున్న మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక రంగంలో కార్మిక చట్టాలను తీసేసి నాలుగు లేబర్ కోడ్‌గా కేంద్ర ప్రభుత్వం మార్చడాన్ని వ్యతిరేకించారు. పాత పద్ధతిలోనే కార్మిక హక్కులు కాపాడాలని కోరారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మొపిద్దీన్, ఉమా మహేష్, దుర్గారావు, శ్రీనివాస్, కిరణ్, గౌతమ్, ఆంథోనీ, సిఐటియు నాయకులు పి.కిషోర్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న నేతలు

వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు వద్దు

బిగించినవాటిని తొలగించాలి
రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, బిగించిన మీటర్లను వెంటనే విద్యుత్ శాఖ తొలగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏలూరు పవర్‌పేట అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గత వైసిపి ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు జిఒ 22ను విడుదల చేసిందని గుర్తు చేశారు. మీటర్లు బిగింపు వ్యతిరేకించిన టిడిపి కూటమి ప్రభుత్వం ఆ జిఒను రద్దు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే భవిష్యత్తులో ఉచిత విద్యుత్ పథకాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. రైతులను భయపెట్టి విద్యుత్ శాఖాధికారులు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం దారుణమని విమర్శించారు. బిగించిన మీటర్లు తొలగించే విధంగా ప్రభుత్వం తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రస్తుత ఖరీఫ్ పంట బీమా పై రాష్ట్ర ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఇప్పటివరకు ఏ జిల్లాలో ఏ పంటకు బీమా వర్తిస్తుందో ప్రకటించలేదన్నారు. రైతు చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించినా తన వాటా ప్రీమియం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కేంద్రం తన వాటా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. అన్ని పంటలకు పంటల బీమా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు పంటల బీమా పథకం అమలు చేయాలని కోరారు. ఆయిల్‌పామ్, కొబ్బరి తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యాన పంటల సబ్సిడీ బకాయిలు పూర్తిగా రైతులకు చెల్లించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం తగదన్నారు. ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి జిల్లా మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కృష్ణా, గోదావరి డెల్టాల కాల్వల ఆధునీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకట్రావు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు పారదర్శకంగా ఉండాలి

ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారిణి వివి.విజయలక్ష్మి

ప్రజాశక్తి - భీమడోలు

ఉపాధి హామీ పనులపై నిర్వహించే సామాజిక తనిఖీలు నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా ఉండాలని ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారిణి వివి.విజయలక్ష్మి కోరారు. భీమడోలు మండలంలో 2023–24వ ఆర్థిక సంవత్సరానికి చేపట్టిన 17వ విడత ఉపాధి హామీ పనులపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ మండల పిఒ, ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిపి కె.రామయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా విజిలెన్స్ అధికారిణి హాజరయ్యారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారిణి మాట్లాడుతూ గ్రామాల వారీగా సామాజిక తనిఖీలు నిర్వహించే సమయంలో విస్తృతస్థాయి ప్రచారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గుర్తించిన లోపాలను వచ్చే సామాజిక తనిఖీ సమయానికి పునరావృతం కాకుండా సిబ్బంది జాగ్రత్త పడాలని సూచించారు. ఉపాధి హామీ మండల స్థాయి అధికారిణి మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం రూ.12.98 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా రూ.1.70 కోట్ల విలువైన మెటీరియల్ కాంపోనెంట్ ఉందన్నారు. ఇదే క్రమంలో రూ.11.35 కోట్ల విలువైన ఉపాధి పనులు, పంచాయతీరాజ్ శాఖకు చెందిన రూ.1.40 కోట్ల విలువైన పనులు, రూ.15 లక్షల విలువైన గ్రామీణ నీటి సరఫరా విభాగం పనులు చేపట్టామన్నారు. ఈ నెల ఐదో తేదీతో గ్రామాల వారీగా సామాజిక తనిఖీలు పూర్తవుతున్న నేపథ్యంలో మండల స్థాయి సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని సెప్టెంబర్ ఐదో తేదీన భీమడోలులో నిర్వహించనున్నామన్నారు. దీనికి జిల్లాస్థాయి అధికారులు పరిశీలకులుగా హాజరవుతారని చెప్పారు. సామాజిక తనిఖీల సందర్భంగా ఏమైనా ఫిర్యాదులు చేయాలంటే రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. ఎంపిపి రామయ్య మాట్లాడుతూ సామాజిక తనిఖీల సందర్భంగా కడుతున్న లెక్కల్లో క్షేత్రస్థాయిలో గతంలో నిర్వహించిన పనులకు ప్రస్తుతం లెక్కలు కడుతున్న వాస్తవ పరిస్థితులకు మధ్య తేడాలు ఉంటున్నాయని, దీనివల్ల రికవరీలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయమై ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తిస్థాయి అవగాహన కల్పించుకుని ఉపాధి హామీ కార్మికులకు నష్టం జరగని విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ చట్టం భీమడోలు సహాయ ప్రాజెక్టు అధికారిణి కె.పద్మ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 16,700 జాబ్‌కార్డులో మంజూరు చేయగా వీటి ద్వారా 27,446 మంది ఉపాధి కార్మికులు నమోదయ్యారన్నారు. వీరి కోసం రూ.4.87 కోట్ల వేతనాలు మంజూరు కాగా రూ.3.47 కోట్లు మాత్రమే వినియోగంలోకి వచ్చాయన్నారు. ఉపాధి హామీ కార్మికులకు సరాసరిన రూ.231 వరకు వేతనం దక్కిందని తెలిపారు. అనంతరం సామాజిక తనిఖీల ఎస్ఆర్‌పి సూర్య సామాజిక తనిఖీలు కొనసాగే విధానం, తనిఖీల సందర్భంగా అధికారులు, ప్రజల మధ్య ఏర్పడాల్సిన సమన్వయం, ఇతర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వికలాంగునికి కృత్రిమ కాలు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వికలాంగ వృద్ధునికి కత్రిమ కాలు అందించారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు అమృతల రంగా మాట్లాడుతూ స్థానిక ఎన్‌టిఆర్ నగర్‌కు చెందిన గడ్డం రాంబాబుకు షుగర్ వ్యాధి వల్ల కుడికాలు తొలగించారు. దీంతో అవస్థలు పడుతున్న గడ్డం రాంబాబు దీన పరిస్థితి డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకరరావు, సంఘ సభ్యులు అగాపే సంస్థ వ్యవస్థాపకులు బిరుదుగడ్డ ఆసిబాబుకు తెలియజేశారు. సుమారు రూ.20 వేల విలువైన కృత్రిమ కాలును దాతల సహకారంతో సమకూర్చారని తెలిపారు. మంగళవారం గడ్డం రాంబాబు ఇంటి వద్ద కత్రిమ కాలును అందజేయడం జరిగిందని తెలిపారు. దివ్యాంగుని దీన పరిస్థితిపై స్పందించి కృత్రిమ కాలు అందించారు.



వికలాంగునికి కృత్రిమ కాలు అందిస్తున్న దాతలు

దస్తావేజు పోయినది

మామిడిశెట్టి దుర్గా వెంకటేశ్వర్లు, తండ్రి : శ్రీనివాసు, నివాసం: డి.నెం.0-20-56/1, కాకరపర్రు శివారు, వెంకట్రాయపురం, పెరవలి మండలం, తూర్పుగోదావరి జిల్లా, అను నేను ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నాకు చెందిన **ఒరిజినల్ దస్తావేజు నెం. 527-11708/2007, తేది.20.06.2017** గలది. సదరు దస్తావేజును తీసుకొని **తేది.10.08.2024**న మా ఇంటి వద్ద నుండి పెరవలి సెంటర్‌కి జిరాక్స్ నిమిత్తం వెళ్తుండగా సదరు దస్తావేజు జారి పడిపోయినది. ఎంతవెదికిననూ దొరకలేదు. కావున ఎవరికైనా దొరికినచో పైన తెలిపి చిరునామాకు అందచేయగలరు.

CHANGE OF NAME

I,VALLURI VENKATESWARA RAO, S/O KRISHNAMURTHI resident of d.no 3-8, NTR Center, Prathipadu village, Pentapadu mandalam, west godavari-534146. I have change my name from VALLURI VENKATESWARLU (OLD NAME) to **VALLURI VENKATESWARA RAO** (NEW NAME) Hence After all my documents and correspondence will be continue with my new name **VALLURI VENKATESWARA RAO**

'మిషన్ వాత్సల్య' సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

ఐసిడిఎస్, బాలల సంరక్షణ జిల్లా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం సేవలను వినియోగించుకోవాలని భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ స్థాయిలో ఎంపిక చేసి లబ్ధి పొందిన 42 మంది లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యుల నుంచి పథకం అమలు, ప్రయోజనాలు తెలుసుకునేందుకు మంగళవారం వారితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమడోలు సిడిపిఒ విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ ప్రాజెక్టు స్థాయిలో ఎంపిక చేసిన 40 మంది బాలలకు ఒక్కొక్కరికి రూ.నాలుగు వేల వంతున మంజూరైన నెలవారీ మొత్తాలను జమ చేశామన్నారు. వారికి 18 సంవత్సరాల వయసు వచ్చేంతవరకు వారి విద్య, ఆరోగ్య పరిరక్షణ, అభివృద్ధికి అవసరమైన ఇతర కార్యక్రమాలు చేపట్టేందుకు ఆ నిధులను వినియోగించుకోవచ్చని చెప్పారు. ఈ మేరకు వివిధ ప్రభుత్వ శాఖలు తమ వంతు సహకారాన్ని వారికి అందిస్తామన్నారు. భీమడోలు ఎంపిడిఒ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య సేవలను విద్యకు పరిమితం చేస్తే ప్రయోజనాలు మరింతగా ఉంటాయన్నారు. ఆరోగ్యపరంగా ప్రభుత్వం వారికే వివిధ రూపాల్లో సహకరిస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులు ఎంపిక విధానం ఇతర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కొందరు లబ్ధిదారులతో వారు మాట్లాడారు. కొందరు లబ్ధిదారులు తాము ఉన్నత స్థానాలకు చేరేందుకు ప్రభుత్వం మరింత సహకారాన్ని, వైద్య సహాయాన్ని అందించాల్సి ఉందని తెలిపారు. మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర కుమార్, ఐసిడిఎస్ సెక్టార్ల పర్యవేక్షకులు నూర్జహాన్ బేగం, షెహనాజ్ బేగం, కవిత, మేరీ, కార్యక్రమ సమన్వయ కర్త బాలస్వామి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీత పాల్గొన్నారు.

S.R.K.R. ENGINEERING COLLEGE (AUTONOMOUS)
Accredited by AICTE, New Delhi and Affiliated to JNTUK, Kakinada, NAAC with A+ Grade, CHINNA AMIRAM (PO) :: BHIMAVARAM, W.G.Dt.
☎ 98488 23332

SPOT ADMISSIONS : APECET-2024

Vacant Seats in the 2nd Year **B. Tech** (Lateral Entry) that may arise out of non-reporting of the students to be filled by the college under Spot Admissions. Interested and eligible candidates (As per **APSCHE** Guidelines available in **ECET-2024** Admissions Website) are requested to approach the college with their original certificates and get themselves registered for the admission on or before 03-09-24. The admission made is provisional and is subjected to ratification by **APSCHE and JNTUK.**
Note :The Students who are admitted under spot admissions are not eligible for the fee reimbursement by the Govt of Andhra Pradesh. *Principal*

2న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాఠశాలల టాయిలెట్ల క్లీనర్లకు (స్వీపర్లకు) ఐదు నెలల బకాయి జీతాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ పాఠశాలల టాయిలెట్ల క్లీనర్స్ (స్కూల్ స్వీపర్ల) యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సెప్టెంబరు రెండో తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాఠశాల టాయిలెట్ల క్లీనర్స్ 1900 మందికి గత ఐదు నెలలుగా బకాయి జీతాలు రూ.4.45 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. పాఠశాలల టాయిలెట్ల క్లీనర్స్ గత ఐదు నెలలుగా ఇచ్చే నామామాత్రపు జీతాలు నెలకు రూ.ఆరు వేలు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు, కలెక్టర్ వెంటనే చొరవ తీసుకుని వారికి ఐదు నెలల బకాయి జీతాలు వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల టాయిలెట్ల క్లీనర్ల సమావేశం స్థానిక నరసింహరావుపేటలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో పూతి దుర్గ, పూజితల అధ్యక్షతన మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాల టాయిలెట్ల క్లీనర్స్‌కు రావాల్సిన ఐదు నెలల బకాయి జీతాల కోసం రెండో తేదీన జిల్లా వ్యాప్తంగా విధులు బహిష్కరించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టాలని సమావేశం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పాఠశాల టాయిలెట్ల క్లీనరందరూ రెండో తేదీన సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పోలవరం ప్రాజెక్టు పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టును ఒడిశా ఎంపీ, ఎంఎల్ఎ బృందం మంగళవారం పరిశీలించింది. పోలవరం ప్రాజెక్టు ప్రభావంతో ఒడిశాలో ముంపు ప్రభావం ఉన్న ప్రాంతాల పరిరక్షణ ఇతర అంశాలపై ఆ రాష్ట్రానికి చెందిన ఎంపీ, ఎంఎల్ఎలతో ఎనిమిది మంది బృందం పోలవరం ప్రాజెక్టును సందర్శించింది. తొలుత స్పిల్ వ్యూ ప్రాంతం నుంచి పరిశీలించిన బృందం స్పిల్ వే ఎగువ, దిగువ కాపర్ డ్యాంలను పరిశీలించింది. వారికి సిఇ నరసింహమూర్తి సంబంధిత వివరాలను తెలిపారు. అనంతరం బృందం తిరిగి ఒడిశా బయలుదేరి వెళ్లారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పెదపాడు

ఓటర్ల జాబితాలను పారదర్శకంగా నిర్వహించేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడిఒ తేజరతన్ తెలిపారు. పెదపాడు తహశీల్దారు కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో ఇన్‌ఛార్జి తహశీల్దార్ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ తేజరతన్ మాట్లాడుతూ ప్రతి బిఎల్ఒ తమ పరిధిలోని పోలింగ్‌బూత్‌లను పూర్తిస్థాయిలో పున:పరిశీలించి ఆయా బూత్‌లలో తగిన ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాబితాలో ఓటర్లు అస్పష్టంగా ఉన్న ఫొటోలను తిరిగి ముద్రణకు చర్యలు, పోలింగ్ బూత్ పరిధిలో జాబితాలు గుర్తింపు, అభ్యంతరాల స్వీకరణపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, Gadhi Praveen Kumar, S/o Gadhi Bhaskara Rao, R/o Door No. 1-113, Gadhi vari thota, Rustumbada, Narasapur, Narasapuram Mandal, W.G.Dist. My daughter, Gadhi Jahnavi Gayathri, in her ICSE, X class, certificate her mother's name was wrongly registered as 'Gadhi Sandhya Rani instead of 'Gadhi Sandya Rani'. Mother's correct name is Gadhi Sandya Rani.

పేరు మార్పు ప్రకటన

మద్దా అభిషేక్ రాజు (కొత్తపేరు), తండ్రి : మద్దా ఇస్రాయేలు రాజు, డోర్‌నెం.1–142 పెద్దపేట, రాజీవ్‌గాంధీ, బొమ్మ దగ్గర, మహ దేవపట్నం, ఉండి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివశించుచున్నాను. ఇప్పుడు నాపేరును మద్దా అభిషేకరాజు (పాతపేరు) తండ్రి : మద్దా ఇస్రాయేలు నుండి మద్దా అభిషేక్‌రాజు (కొత్తపేరు) తండ్రి : మద్దా ఇస్రాయేలుగా మార్చుకున్నారు. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్తపేరును ఉపయోగించవలెను.

మద్దా అభిషేక్ రాజు, తండ్రి మద్దా ఇస్రాయేలు, మహదేవపట్నం, ఉండి మండలం, ప.గో.జిల్లా. ఎ.పి., సెల్ : 9912291119

లింక్ దస్తావేజు పోయినది

నా తాలూకు అనగా నేను ది.27-10-2004వ సం.రం. తేదీనాడు డిటో కాపురస్థులైన ముళ్ళపూడి సుగుణమ్మ, ముళ్ళపూడి నరేంద్రబాబు గార్ల నుండి ఏలూరు R.O లో దస్తావేజు నెం.9673/2004గా రిజిష్టరీ చేయించి క్రయం పొందినాను. నేను సదరు 9673/2004 యొక్క లింక్ దస్తావేజు నెం.446/1965 దస్తావేజును జిరాక్స్ నిమిత్తం ది.28-06-2024వ తేదీన ఉదయం 10 గంటలకు ఏలూరు కుండి సెంటర్ నందు జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళి జిరాక్స్ తీసుకొని సదరు దస్తావేజులు నా బ్యాగ్ మార్గమధ్యలో పడిపోయినది. బ్యాగు పోవుట చూసుకొని అదే మార్గములో జిరాక్స్ ఎంక్వయిరీ చేసినాను. సెంటర్ వద్దకు వెళ్ళినాను. ఎంక్వయిరీ సదరు బ్యాగు దస్తావేజున నెం.446/1965 దొరకలేదు. కావున ఎవరికైన దొరికిన ఎడల అప్పగించిన తగిన పారితోషికం ఇవ్వగలవాడను.

కొమ్మినేని నాగమణి, W/o.శ్రీనివాసరావు, 7–41, చెరువు గట్టు దగ్గర, వట్లూరు, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా. సెల్: 9989073587